క్లుప్తంగా

నేడు అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘం కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ లక్కెబోయిన ఎస్తేరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

పర్చూరు (చినగంజాం): పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం పర్చూరులోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టపాసులు విక్రయించే ప్రాంతాల్లోను జాగ్రత్తలు పాటించాలన్నారు. విక్రయాలు లైసెన్సు పొందిన దుకాణాల్లోనే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయించాలని తెలిపారు.

కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్

బల్లికురవ: విద్యపై ఏకాగ్రతతో కృషి, పట్టుదలతో చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని బల్లికురవ ఎస్సై జీవి చౌదరి కోరారు. మంగళవారం సాయంత్రం వైదన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలపాటు కష్టపడటంతోపాటు ఇష్టపడి చదువుతూ పాఠశాలకు గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. పదో తరగతి ఫలితాలే విద్యార్థి జీవితంలో తొలిమెట్టు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

చీరాల అర్బన్: ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత కార్మికులు పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్ లైఫ్ సర్టిఫికెట్‌ను నవంబర్‌లో అందించాలని రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ చీరాల డిపో కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఆధార్ కార్డు, పెన్షన్ తీసుకునే బ్యాంకు పాస్‌బుక్, గుర్తింపు కార్డు జిరాక్స్‌ను అసోసియేషన్ ప్రతినిధులకు అందించి దరఖాస్తును పూర్తి చేయించుకోవాలన్నారు. అలానే బస్‌పాస్ కాలపరిమితి ముగిసిన వారు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.

భీమవరంలో నేత్రదానం

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన పిన్నెపల్లి వెంకాయమ్మ (78) మంగళవారం చనిపోవడంతో ఆమె బంధువులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆమె నేత్రాలను దానం చేశారు. గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో వారి కుమారులు ఆంజనేయులు, బ్రహ్మయ్య, బంధువులు పాల్గొనగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌కే రఫీ, కార్యదర్శి చుండి సాంబశివరావులు వారికి అభినందనలు తెలియజేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

చినగంజాం: మండలంలోని గొనసపూడి గ్రామంలో పంట కాలువలో శనివారం కొట్టుకొచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. ఆవ్యక్తి బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన యంపరాల వెంకటేశ్వర్లు (83)గా గుర్తించారు. మృతుడు వేసుకున్న చొక్కా కాలర్ దగ్గర ఉన్న టైలర్ పేరును గుర్తించి దాని ద్వారా దర్యాప్తు చేసి అతని ఆచూకీ కనుగొన్నట్లు ఎస్ఐ తెలిపారు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు తప్పనిసరి

బల్లికురవ: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులను డిసెంబర్ వరకు చేపడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 పంచాయతీల్లోని సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు.

కోళ్ల దొంగలపై కేసు

చినగంజాం: కోళ్ల దొంగతనం ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శీలం రమేష్ వివరాల మేరకు.. మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన పులుగు పెరుమాళ్లరెడ్డి తన ఇంటి దగ్గర కోళ్ల పెంపకం చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఈనెల 19వ తేదీ రాత్రి పెరుమాళ్లరెడ్డి తల్లి వారి ఇంటి ముందు తమ కోళ్లను గంప కింద ఉంచింది. అదే రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంప వద్ద నిలబడి ఉండటం గమనించి కేకలు వేసింది. దాంతో ఆ వ్యక్తులు అక్కడి నుండి పరారై వెళ్లిపోయారు. అనంతరం పెరుమాళ్లరెడ్డి చూడగా ఒక కోడి పుంజు, రెండు కోడి పెట్టలు కన్పించకుండా పోయినట్లు గుర్తించారు. దాంతో తన గ్రామానికి చెందిన అక్కల రమణారెడ్డి, కుక్కల కిరణ్‌కుమార్ రెడ్డి,అక్కల సుబ్బరామిరెడ్డిలు సుమారు రూ. 10 వేలు విలువ కలిగిన తన కోడిపుంజు, రెండు కోడి పెట్టలు దొంగిలించారన్న అనుమానంతో గ్రామ పెద్దలకు సమాచారమిచ్చారు. వారి సలహా మేరకు అనుమానిత వ్యక్తులను విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎప్పుడు తలలు పగులుతాయో !


భవనం శివారులో మొక్కలు పెరిగి గోడలోకి చొచ్చుకెళ్తున్న వేర్లు


పెచ్చులు ఊడకుండా స్లాబుకు రక్షణగా చెక్కలు కొట్టిన అధికారులు

- శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ శాఖ కార్యాలయం
- పెచ్చులూడిపోతున్న స్లాబులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


వర్షపాతం నమోదు చేసే ప్రాంతంలో మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం


కార్యాలయ భవనం స్లాబు పగుళ్లిచ్చి కనబడుతున్న ఇనుప చువ్వలు

చీరాల రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగాగల మురుగునీరు పారుదల (ఇరిగేషన్ శాఖ) కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం స్లాబులు పెచ్చులూడిపోతుండడంతో అందులో పనిచేసే ఉద్యోగులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తంచేస్తూ బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్ వెనుక 1970లో మురుగునీరు పారుదల శాఖ (ఇరిగేషన్ శాఖ) కార్యాలయాన్ని ఎంతో సువిశాల ప్రదేశంలో నిర్మించారు. నిర్మించి ఏళ్లు గడుస్తుండడంతో పాటు దానిపై పర్యవేక్షణ కొరడడంతో వర్షపునీరు కార్యాలయ గదుల్లోకి చేరుతుంది. అంతేకాక స్లాబులు పగుళ్లు రావడంతో పాటు స్లాబులకు సెమెంట్ పెచ్చులూడిపోవడంతో ఇనుప చువ్వలు కూడా బయటకు కనబడుతున్నాయి. ఎప్పుడు ఎవరిమీద పడతాయోనని అందులో పని చేస్తున్న ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికంగా ఉద్యోగులు..

ఈ కార్యాలయ పరిధిలో చీరాలతో పాటు బాపట్ల, చిలకలూరిపేట, సంతమాగులూరు నియోజకవర్గాలున్నాయి. ఆయా పరిధిలోని మురుగునీరు పారుదలకు సంబంధించిన ఏ విషయమైనా అక్కడి రైతులు కానీ ఇక్కడకు రావాల్సిందే. ఈ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఏఈలు, మేనేజర్‌తో పాటు మరో 34 మంది ఉద్యోగులు ప్రతిరోజు తమ విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఐదుగురు మహిళా ఉద్యోగినులు కూడా ఉన్నారు. కురిసిన వర్షాలకు భవనం స్లాబులు మొత్తం తడిసి నానిపోయింది. మూడు రోజులు క్రితం స్లాబు పెచ్చులు ఊడి కిందపడిపోయాయి. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంలో పెను ప్రమాదం తప్పిందని ఉద్యోగులు వాపోతున్నారు. స్లాబు పెచ్చులూడిపోతుండడంతో అందులో పనిచేసే సిబ్బంది స్లాబు పెచ్చులు కిందపడకుండా తాత్కాలికంగా స్లాబుకు ఆనించి చెక్కలు కొట్టించారు.

అపరిశుభ్రంగా కార్యాలయ పరిసరాలు..

కార్యాయలయ పరిసరాలు కూడా చాలా అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కార్యాలయం ఎక్కువ విస్తీర్ణంలో ఉండడంతో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో పరిసరాలలో ఎక్కువగా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాక రెయిన్ ఫాల్ తెలిపేందుకు ఏర్పాటు చేసిన స్థలంలో కూడా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇకనైనా ఉన్నతాధికారులు కార్యాలయంపై దృష్టిసారించి భవనాలకు మరమ్మతులు చేయించి సమస్యల నుంచి గట్టెక్కించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

> **నిధులు వస్తే భవనాలకు మరమ్మతులు..**
> భవనం నిర్మించి 50 ఏళ్లకుపైగా అవుతుంది. స్లాబులు పగుళ్లిచ్చి ప్రమాదకరంగా ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. వర్షాలు కురిస్తే వర్షపునీరు మొత్తం కార్యాలయం గదుల్లోకి వస్తాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులందరూ ఆందోళన చెందుతున్నారు. భవనాలు మరమ్మతులు చేసేందుకు రూ. 21 లక్షలు ఖర్చు అవుతాయని మూడు నెలలు క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.
> – మురళీకృష్ణ, ఈఈ, ఇరిగేషన్ శాఖ

భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు


మేదరమెట్ల గ్రామసభలో పాల్గొన్న అధికారులు, అర్జీదారులు


చినగంజాంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



దగ్గుబాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు అనిత

మేదరమెట్ల: ఆయా పంచాయతీల్లో భూసమస్యలను పరిష్కరించడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని సోమవరప్పాడు పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ సదస్సు మంగళవారం గ్రామ సచివాలయంలో జరిగింది. కార్యక్రమంలో పలువురు తమ సమస్యల అర్జీలను అందచేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రవికాంత్, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఉపసర్పంచ్ మన్నె దుర్గారావు, కృష్ణమోహన్, ఈవో లక్ష్మీకాంత్, వీఆర్‌వో పాల్గొన్నారు.

కడవకుదురులో గ్రామ సభకు 82 అర్జీలు

చినగంజాం: మండలంలోని కడవకుదురు రెవెన్యూ గ్రామ పరిధిలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు 82 అర్జీలందినట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలకు సంబంధించి 53 అర్జీలు, మ్యుటేషన్‌కు సంబంధించి 24 అర్జీలు, జాయింట్ భూములకు సంబంధించి అర్జీలందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సుజాత, మండల సర్వేయర్ జీ సుబ్బారావు, వీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేలా చర్యలు..

కారంచేడు: గ్రామాల్లోని రైతులకు ఉన్న సాగుభూముల సమస్యలపై గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత అన్నారు. ఆమె మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన భూముల రీ సర్వే గ్రామ సభలో రైతులు, ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రైతులకు చెందిన భూముల ఆన్‌లైన్ విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ సమస్యలగు గుర్తించి వాటిని సరిదిద్దే కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు చేపట్టారన్నారు. అలాగే భూముల విస్తీర్ణంలో తేడాలు, నమోదుల్లో పేర్లు తేడాలు, ఆన్‌లైన్ అప్‌డేట్ సమస్యలున్నాయన్నారు. భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యన్నారాయణ, వీఆర్ఓ, గ్రామ సర్వేయర్లు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దాం

మార్టూరు: హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కోసం దశాబ్దాల తరబడి పోలీసుశాఖ నిర్విరామ కృషి చేస్తుందని.. ఆ మహమ్మారిని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించడం కోసం మరింత బాధ్యతాయుతంగా పని చేద్దామని ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం స్టేషన్ సిబ్బంది మరియు మండలంలోని సచివాలయాల మహిళ పోలీసు సిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాప్తికి ప్రధానంగా మాదకద్రవ్యాల మత్తులో విచ్చల విడిశృంగారం, అపరిశుభ్రకరమైన సూదుల ద్వారా రక్త మార్పిడి కారణాలు అవుతున్నాయన్నారు. ప్రాణాంతక వ్యాధి వ్యాప్తి వలన జీవితాలు నాశనం అవుతున్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రజా సంఘాల సహకారంతో దాని నిర్మూలనకు కృషి చేద్దామన్నారు. బాపట్ల జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ మాట్లాడారు. కార్యక్రమాల్లో హెడ్ కానిస్టేబుల్ పి ఆంజనేయులు, కోటేశ్వరరావు, రైటర్ కె సాయిరాం, కానిస్టేబుల్ జి రమేష్ బాబు, ఎయిడ్స్ నిర్మూలన సంస్థ ప్రతినిధులు కే.దుర్గ,ఏ. మెహరున్నీసా, ప్రమీల, రమ్య, సల్మా, సచివాలయాల మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ మెహబూబ్ బాషా

రాయితీపై శనగ విత్తనాలు


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

మార్టూరు: శనగ పంట సాగు చేసే రైతులకు 25% రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేయుటకు రైతు సేవ కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము పంట సాగు చేసి నష్టపోయిన 530 మంది రైతులకు సంబంధించి 1100 ఎకరాల పంటను గుర్తించి అంచనాలు రూపొందించి నివేదికను ఉన్నత అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో కిరణ్ కుమార్ రెండు గ్రామాల రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కారంచేడు: గ్రామాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలు అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రధానమని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ కలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో వ్యాపించే సీజనల్ వ్యాధుల నుంచి తప్పించుకోవాలంటే ప్రజలందరూ తప్పనిసరిగా కాచి చల్లార్చిన శుద్ధమైన తాగునీటిని, వేడి వేడిగా తయారు చేసుకున్న ఆహారం మాత్రమే తీసుకోవాల్సి ఉందన్నారు. ఉచిత వైద్య శిబిరంలలో ఆయన జ్వరాలతో బాధపడుతున్న సుమారు 40 మందికి వైద్య పరీక్షలు చేశారు. హెచ్‌వీ ఎం వీరమ్మ, హెచ్ ఎస్ డీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

నేడు విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

పర్చూరు (చినగంజాం): స్థానిక రోటరీ భవన్‌లో బుధవారం వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మంగళవారం తోకల కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు, జాగర్లమూడి, అన్నంబొట్లవారిపాలెం, చెరుకూరు గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికా విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నార్త్ హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో సైకిళ్లను అందించనున్నట్లు ఆయన వివరించారు. రోటరీ సభ్యులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఈకార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

పాముకాటుకు కూలీ మృతి


మృతి చెందిన వెంకటేశ్వరమ్మ

జే.పంగులూరు: పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొండమూరు గ్రామంలో సోమవారం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం ప్రకారం కొండమూరు గ్రామానికి చెందిన నాయుడు వెంకటేశ్వరమ్మ (43) వ్యవసాయ కూలి. ప్రతి రోజు గ్రామంలో వ్యవసాయ పనులు వెళ్తుంటుంది. రోజు మాదిరిగానే తోటి కూలీలతో మృతురాలు వెంకటేశ్వరమ్మ సోమవారం గ్రామంలోని మినుము కోతకు వెళ్లింది. మినుము కోత కోస్తుండగా వెంకటేశ్వరమ్మను పాము కాటు వేసింది. గమనించి తోటి కూలీలు వెంటనే ఆమెను ఆటోలో వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యంలో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు వెంకటేశ్వరమ్మకు ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. 11 సంవత్సరాల క్రితం భర్త అచ్చయ్య అనారోగ్యంతో చనిపోయాడు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం బాడీని బంధువులకు అప్పగించారు.

340 మంది స్వాములకు అన్న వితరణ

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్ప స్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా పదో రోజైన మంగళవారం 340 మంది స్వాములు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నాటి పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించినట్లు సేవా సమితి నిర్వాహకులు తెలిపారు.

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన

చీరాల అర్బన్: రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న రోటరీ యువజన వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోంది. యువజన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బాలబాలికలకు వికసిత్ భారత్ 2047 అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 203 మంది బాలబాలికలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా వెంకటేశ్వర్లు, అరవింద్, భవానిలు వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, టి.మల్లికార్జునరావు, టి.లక్ష్మీప్రతాప్, మామిడాల శ్రీనివాసరావు, తల్లం సాయిగోపాలకృష్ణ, ఎంవీ రామారావు, చుక్కా శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధి నిధులతో పంట కాల్వలు తవ్వాలి


తలపనేని రామారావు

జే.పంగులూరు: ఉపాధి నిధుల ద్వారా పంట కాల్వలు తవ్వించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు అన్నారు. ఈవిషయమై రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మంగళవారం పంగులూరు విలేకరులతో రామారావు మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా పంట కాలువల మరమ్మతులు చేయాలని గతంలోనే పంచాయతీ సమావేశాల్లో తీర్మాణాలు చేసినప్పటికీ అమలు జరగడం లేదని, అధికారులు తక్షణమే పంట కాలువలు మరమ్మత్తులను ఉపాధి నిధులతో చేయించాలని కోరారు. సాగునీటి యాజమాన్యం నిర్వహించడానికి తగినంత మంది లస్కర్లు లేకపోవడం వలన సాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఒప్పంద పద్ధతిలోనే లస్కర్ల నియామకం జరిపి సాగర్ నీటి చివరి భూముల వరకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన ఉత్పత్తులు


గన్నవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


తిమ్మనపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ ధనరాజ్

యద్దనపూడి: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తూ నాణ్యతతో కూడిన ఉత్పత్తులు సాధించాలని పర్చూరు ఏడీఏ మోహన్‌రావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గన్నవరం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో బాపట్ల డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి, వ్యవసాయాధికారి సీహెచ్ ఆదినారాయణతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనగ, పొగాకు పంటలపై తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెపోగు అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్,వీఏఏలు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతులే చెల్లించాలి..

మేదరమెట్ల: ఈ ఏడాది రబీలో సాగు చేస్తున్న పంటలకు పంటల బీమాను రైతులే చెల్లించికోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కే.ధనరాజ్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు, తిమ్మనపాలెం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మినుము పంటకు ఎకరాకు రూ.60, శనగపంటకు రూ.84, ముక్కజొన్నకు రూ.105 ఎకరాకు ప్రీమియంగా చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారాగానీ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా గానీ, మీసేవా సెంటర్‌లలో డిసెంబరు 15లోగా చెల్లించాలని సూచించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, వ్యవసాయ అనుబంధ శాఖల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో ఉపయోగాలు


వెలమవారిపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో


పర్చూరులో కార్మికుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

పర్చూరు (చినగంజాం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు ఈఓపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో పర్చూరు మండల పరిషత్ కార్యాలయంలో క్లాప్ మిత్రలందరికీ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐటీసీ సెర్ప్ ఆర్గనైజర్ అరుణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలని, పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ లింకు చేయించుకోవాలని కోరారు. ఐటీసీ, సెర్ప్ కల్పించే అవగాహన కార్యక్రమం ద్వారా మీ జీవితానికి ఎంతోఉపయోగకరమైన బీమా పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ స్కీంలు పీఎంఎస్‌బీవై, పీఎం జేజేబీవై, పీఎంఎంవై, పీఎంజేడీవై, పీఎంఎస్ఎస్‌వై, పీఎంఏవై, పీఎంపీవీవై మొదలగు స్కీంలు గురించి వాటికి కావాల్సిన అర్హతలు గురించి వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ కమ్యూనిటీ ఆర్గనైజర్ సుమంత్, మండలంలోని కార్మికులు పాల్గొన్నారు.

రబీ నుంచి పీఎం ఫసల్ బీమా యోజన..

బల్లికురవ: రబీ సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల భీమా యోజన ద్వారా పంటల బీమా అమలు చేస్తారని మండల వ్యవసాయాధికారిణం ఎస్‌వీపీ కుమారి అన్నారు. మంగళవారం వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంట ఎకరాకు రూ. 126, శనగకు రూ. 94, మొక్కజొన్న ఎకరాకు రూ. 105, జొన్న ఎకరాకు రూ. 38, పెసరకు రూ. 36, మినుముకు రూ. 60, వేరుశనగకు రూ. 60 చొప్పున ప్రీమియం కట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎయంసి సిబ్బంది, సురేష్, చెన్నకేశవరెడ్డి, ప్రసన్న, వెలమవారిపాలెం మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి అనిల్, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గడువులోగా మద్యం దుకాణాన్ని తొలగించాలి

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సంబంధించి నెల కొన్న వివాదంలో మహిళలు నిర్వాహకులకు గడువు విధించారు. నివాస గృహాల మధ్య మద్యం దుకాణం నిర్వహించడం ఇబ్బందిగా ఉందని మహిళలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంగళవారం ఇరువురు మధ్య స్వల్ప ఒప్పందం చేసుకున్నారు. మద్యం షాపు వలన స్థానిక కుటుంబాలకు ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో వారం, 10 రోజులు గడువు ఇస్తే షాపును వేరే ప్రాంతానికి మార్చడమో లేక గది నిర్మాణం చేసుకోవడమో చేస్తామని నిర్వాహకులు కోరడంతో అందుకు మహిళలు సమ్మతించారు. దాంతో ప్రస్తుతానికి మద్యం షాపు వివాదం తాత్కాలికంగా సద్దు మణిగింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్
90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com